క్లుప్తంగా

పేదలందరికీ ఉచిత వైద్య సేవలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మోహన్‌వేలు

తవణంపల్లె: పేదలందరికీ ఉచిత వైద్య సేవలందిస్తున్నట్లు వైద్యాధికారి మోహన్‌వేలు తెలిపారు. మండలంలోని దిగువమోదలపల్లెలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ మోహన్‌వేలు ఆరోగ్య సూత్రాలను ప్రజలకు వివరించారు. పల్లెలో పారిశుధ్యం మెరుగుపడితే రోగాలు దూరం అవుతాయన్నారు. ప్రతి ఒక్కరూ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భవతులు, బాలింతలు, బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త శ్రీనివాసులు, ఎంఎల్‌హెచ్‌పి పావని, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే వైద్యసేవలు



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ అనూష

గుడిపాల: ప్రతి ఇంటి వద్దకే వైద్యసేవలు అందజేస్తున్నట్లు బొమ్మసముద్రం వైద్యాధికారి అనూష తెలిపారు. మండలంలోని శ్రీరంగంపల్లె గ్రామంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, మాత్రలను అందజేశారు. అనంతరం ఇంటివద్ద మంచాన పడిన రోగుల వద్దకు వెళ్లి వారికి కావాల్సిన వైద్యసేవలను అందజేశారు. గర్భిణులు, బాలింతలకు వైద్యసేవలు అందించి పౌష్టికాహారం తీసుకోవాలని వారికి సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది రెజ్వాన, అన్నపూర్ణ, శిరీషా, శివగామి పాల్గొన్నారు.

వైభవంగా పాలేటమ్మ నిమజ్జనం



అమ్మవారిని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు

ఐరాల: మండల కేంద్రంలో పాలేటమ్మ గంగ జాతరను పురస్కరించుకుని బుధవారం అమ్మవారి ప్రతిమను నిమజ్జనం చేశారు. సాయంత్రం అమ్మవారికి మహిళలు పిండి దీపాలతో కుంభం వేశారు. అమ్మవారిని ప్రత్యేక పట్టువస్త్రాలతో అలంకరించి పూజలు చేపట్టారు. యువత రంగులు చల్లుకుని పాలేటమ్మ ప్రతిమను ఊరేగింపుగా తీసుకెళ్లారు. అమ్మవారికి భక్తులు కొబ్బరి కాయలు కొట్టి, హారతులు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. సమీపంలో ఉన్న చెరువులో అమ్మవారిని నిమజ్జనం చేశారు.

షాపింగ్ కాంప్లెక్స్ కాదు.. మినీ బార్

పలమనేరు: పట్టణంలోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ మందుబాబులకు అడ్డాగా మారింది. స్థానిక సూపర్‌బజార్ ముందు మున్సిపాలిటీ కాంప్లెక్స్‌ను నిర్మించింది. ఇందులో కొన్ని దుకాణాలు మూతబడి ఉన్నాయి. ఈ దుకాణాల వద్ద కాస్త మరుగు ఉంటుంది. ఇది మందుబాబులకు అనుకూలంగా మారింది. పగలే మద్యం, వాటర్ ప్యాకెట్లు, ప్లాస్టిక్ గ్లాసులతో ఇక్కడికి వచ్చి మందుకొట్టి వెళ్తున్నారు. చీకటి పడితే అసాంఘిక కార్యక్రమాలకు కూడా ఇదో అడ్డాగా మారింది. ఇటీవల ఇక్కడే ఓ మహిళ హత్యకు గురైన విషయం తెలిసిందే. పగలే మందుబాబులు, అపరిచిత వ్యక్తులు ఇక్కడ మకాం పెడుతున్నా అక్కడికి బ్లూకోట్ పోలీసులు వెళ్లిన దాఖలాలు లేవు. పోలీసుల రాత్రి గస్తీ అంతంత మాత్రంగానే ఉండడంతో ఇక్కడ ఏమి జరుగుతున్నా పట్టించుకునేవారే కరువైయ్యారు. ఇకనైనా పోలీసులు దీనిపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.



వ్యవసాయ కార్యాలయంలో పంపిణీకి సిద్ధంగా ఉన్న వేరుశనగ విత్తనకాయలు



విత్తనాల పంపిణీకి రైతుల నుంచి వేలిముద్ర తీసుకుంటున్న అధికారులు

రైతుల ముంగిటకే విత్తనకాయలు

- చిత్తూరు డివిజన్‌లో వేగంగా వేరుశనగ పంపిణీ
- వేలిముద్ర ఆధారంగా విత్తనాలు అందిస్తున్న వైనం
- సజావుగా సాగుతున్న పంపిణీ
- కాయలు నాణ్యంగా ఉన్నాయంటున్న రైతులు



రైతులకు విత్తనాలు అందజేస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

కాణిపాకం: సీజన్‌కు అనుగుణంగానే వర్షాలు పడుతున్నాయి. కురుస్తున్న వర్షం రైతుల్లో ఆశలు చిగురించింది. రైతులు సాగుకు సమాయత్తమయ్యారు. దీనికితోడు ప్రభుత్వం వేరుశనగ కాయల పంపిణీకి రైతుల ముంగిటకే కాయలు అందుతున్నాయి. వేలిముద్ర సేకరణతో కాయలు ఇచ్చేస్తున్నారు. జోరుగా పంపిణీ సాగుతోంది. సచివాలయ సిబ్బంది సమక్షంలో గొడవలకు తావులేకుండా సజావుగా కాయలిచ్చే కార్యక్రమాన్ని సాగిస్తున్నారు. విత్తనం బాగుందని రైతుల నోటమాట బలంగా విస్తరించడంతో కొనుగోలుపై ఆసక్తి పెరిగింది. కాయలకు డిమాండొచ్చింది.

ఖరీఫ్ దృష్ట్యా చిత్తూరు డివిజన్‌లో వర్షాధార పంటగా వేరుశనగను సాగు చేస్తారు. ప్రస్తుతం సాధారణ సాగు విస్తీర్ణం 15,833 హెక్టార్లుగా ఉంది. ఇందుకు అనుగుణంగా వ్యవసాయ శాఖ అధికారులు కాయలను తెప్పించే ప్రయత్నం చేశారు. డివిజన్‌కు 12,870 క్వింటాళ్ల కాయలు కావాలని ప్రభుత్వానికి నివేదికలు పంపారు. అయితే ప్రభుత్వం 13,118.10 క్వింటాళ్ల కాయలు సరఫరా చేసింది. ఇందులో కే–6 రకం 11927.70 క్వింటాళ్లు రాగా, నారాయణి 540 క్వింటాళ్లు, టీజీసీఎస్–1694 రకం 650.40 క్వింటాళ్లు వచ్చాయి. వీటిని వ్యవసాయ శాఖ అధికారులు ఆర్బీకేల వారీగా విభజించారు. 174 కేంద్రాలను ఏర్పాటు చేసి విత్తనాలిచ్చే కార్యక్రమాన్ని ప్రారంభించారు. గతంలో వలంటీర్ల సహాయంతో కాయలిచ్చేవారు. ఎన్నికల ప్రభావంతో ఈసారి సచివాలయ సిబ్బంది అంటే వ్యవసాయశాఖ సహాయకులతోపాటు పంచాయతీ కార్యదర్శులు, డిటిజల్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో కాయలిచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వేలిముద్ర ఆధారంగా రైతులకు విత్తనాలిస్తున్నారు. తొలి రోజు పంపిణీ చేసిన కాయలు బాగున్నాయనే టాక్ వచ్చింది. ఈ టాక్‌తో కాయల కోసం రైతులు క్యూ కడుతున్నారు. నాణ్యతతో పాటు గింజ సైజు పెద్దవిగా ఉండడంతో రాయితీ కాయలకు మరింత గిరాకీ పెరిగింది. అన్ని పంపిణీ కేంద్రాల వద్ద కాయల కోసం రైతులు ఆసక్తి చూపుతున్నారు. గొడవలు, రద్దీకి తావు లేకుండా పంపిణీని ప్రశాంతంగా జరిపిస్తున్నారు. ఇప్పటి వరకు 10,471 క్వింటాళ్ల పంపిణీ చేసినట్లు అధికారులు లెక్కలు చెబుతున్నారు.

గతంలో కాయలకు కుస్తీ

ఖరీఫ్ సీజన్ అంటే వర్షధార పంటే గుర్తుకొస్తుంది. నాలుగేళ్ల కిందట అయితే మండలంలో పెద్దగా వర్షాలు లేవు. అప్పట్లో ఆ వర్షాలను నమ్ముకుని రైతులు నట్టేట మునిగిపోయారు. వేసే గింజ మొలకెత్తే పరిస్థితి కనిపించేది కాదు. అలా మొలకెత్తినా ఎదిగేది కాదు. అప్పట్లో రక్షక తడులంటూ హడావుడి చేసినా ఫలం దక్కలేదు. ఈ నేపథ్యంలో రైతులు డీలాపడిపోయారు. పెట్టుబడి పెట్టి వేరుశనగ సాగు చేయాలంటే భయపడేవారు. దీంతో వేరుశనగసాగు చేసే వారి సంఖ్య తగ్గుతూ వచ్చింది. ఇక వేరుశనగ కాయల కోసం రైతులు పడరాని పాట్లు పడేవారు. మండల కేంద్రంలో మాత్రమే కాయలు ఇవ్వడంతో రైతులు కుస్తీ పడుతూ, గందరగోళ పరిస్థితులను చూసేవారు.

ఇప్పుడు అలా లేదు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక పంట పండించే రైతులకు మంచి రోజులు వచ్చాయి. వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయి. బోరు, బావులు, చెరువులు నిండుకున్నాయి. దీనికి తోడు ఖరీఫ్ ఆరంభానికి ముందే ప్రభుత్వం రైతులను విత్తు విత్తేందుకు సిద్ధం చేస్తోంది. చేతిలో పెట్టుబడి సాయాన్ని పెడుతోంది. దుక్కులు దున్ని, విత్తు వేసేందుకు అయ్యే ఖర్చును రైతు భరోసా పేరుతో రైతు ఖాతాలో రూ.7,500 జమ చేస్తోంది. ఈ సారి మాత్రం ఎన్నికల కోడ్ అడ్డొచ్చింది. రాయితీతో వేరుశనగ కాయలను అందజేస్తోంది. ఈ ఫలితంగా ధైర్యంగా రైతు బీడు భూములను సైతం దుక్కి చేసి విత్తు వేస్తున్నాడు. గత నాలుగేళ్లుగా సాగు లెక్కలు చూస్తే గణనీయంగా పెరుగుతున్నాయి. ఈ క్రమంలో ప్రభుత్వం అందించే కాయలకు ఎక్కడిలేని డిమాండ్ ఉంది.

ఈ పంట నమోదుతో..

ఖరీఫ్ సీజన్‌లో పండించే పంటకు ప్రభుత్వం ఈ క్రాప్ బుకింగ్‌తో భరోసా కల్పిస్తోంది. పంట నష్టపోతే వేసే ప్రతి పంటకు ఆర్థిక సాయం అందిస్తోంది. బుకింగ్ ఆధారంగా విత్తనాలను సరఫరా చేస్తోంది. నిజంగా పంట వేసే రైతుకు విత్తనాలు చేరేలా అడుగులు వేస్తోంది. విత్తనాల పంపిణీలో క్రాప్‌బుకింగ్‌ను ప్రామాణికంగా తీసుకుంటోంది. ముఖ్యంగా వేరుశనగ తీసుకొని విత్తనాలు వేయని రైతులకు గుర్తిస్తోంది. వీరికి చెక్ పెట్టేలా ప్రయత్నాలు చేస్తోంది. చాలా మంది విత్తనాలను వంటనూనె అవసరానికి వాడుకుంటున్నారని తెలిసి ప్రతి ఏటా ఈ క్రాప్ బుకింగ్‌ను పక్కాగా చేపడుతోంది.

కాయలు తీసుకుంటే విత్తు వేయాలి



వేరుశనగా పంపిణీ అన్ని ఆర్బీకేల ద్వారా జరుగుతోంది. సజావుగా సాగుతోంది. ఇప్పటికి 90 శాతం కాయల పంపిణీ పూర్తయింది. ఎక్కడా కాయల కోసం గొడవలు లేవు. రైతుల అవసరాన్ని బట్టి కాయలు ఇస్తున్నాం. కాయలు కూడా బాగున్నాయి. అందుకే రైతులు కాయల కొనుగోలుకు ఆసక్తి చూపిస్తున్నారు. విత్తనం తీసుకున్న ప్రతి రైతు కూడా కచ్చితంగా విత్తు వేయాలి. పంట వేసిన తర్వాత ఈ క్రాప్ బుకింగ్ ఉంటుంది. ఇకపై వాటి ఆధారంగానే రాయితీ విత్తనాలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటాం. అదునుకు తగ్గట్లు విత్తనాలు వేసుకుంటే మంచిది.

–ఉమ, వ్యవసాయశాఖ ఏడీ, చిత్తూరు

ఎక్సైజ్ వాహనాల వేలం రేపు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో (సెబ్) రూరల్ స్టేషన్‌లో శుక్రవారం పలు వాహనాలను వేలం వేయనున్నట్లు సీఐ హరికృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. మిట్టూరులో ఉన్న తమ స్టేషన్ ఆవరణలో ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం పాట జరుగుతుందన్నారు. మద్యం తరలిస్తూ పట్టుబడ్డ ఓ కారుతో పాటు ఏడు ద్విచక్రవాహనాలను వేలం వేయనున్నట్లు తెలిపారు.

అలరించిన అర్జున తపస్సు



తపస్సుమాను అధిరోహిస్తున్న అర్జున వేషధారి

శ్రీరంగరాజపురం : మండల పరిధిలోని తయ్యూరు పాయికట్టు అంకనపల్లి గ్రామంలో జరుగుతున్న శ్రీద్రౌపదీదేవీ సమేత ధర్మరాజుల వారి మహాభారత వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన అర్జున తపస్సు భక్తులను ఆకట్టుకుంది. వేకువజామున ద్రౌపదీదేవి ఉత్సవమూర్తితో పాటు శ్రీకృష్ణ, భీమ, అర్జున, నకుల, సహదేవుల ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అర్జున తపస్సుమాను వద్దకు చేరుకున్న అర్జున వేషధారి పద్యాలను ఆలపిస్తూ తపస్సుమాను అధిరోహించారు. వెంట తీసుకెళ్లిన విబూది, నిమ్మ పండ్లను కిందకు విసరగా వాటి కోసం భక్తులు ఎగబడ్డారు. సంతానం లేని మహిళలు సంతానం కోసం తపస్సుమాను కింద వరపడి స్వామివారిని వేడుకున్నారు. అర్జున తపస్సుకు సంబంధించిన ఘట్టాన్ని భాగవతారిణి భక్తులకు వివరించారు. కార్యక్రమంలో ఉభయదారులుగా డిసెంబర్‌శెట్టి కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

వేసవి సెలవుల్లోనే బదిలీలు నిర్వహించాలి



బదిలీ యాక్ట్ సూచనలను లిఖిత పూర్వకంగా అందజేస్తున్న ఆపస్ సంఘ నేతలు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రతి ఏడాది వేసవి సెలవుల్లోనే ఉపాధ్యాయుల బదిలీలు నిర్వహించాలని ఆపస్ (ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం) రాష్ట్ర అధ్యక్షులు బాలాజీ తెలిపారు. ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ బదిలీల చట్టంపై విజయవాడలో రాష్ట్ర పాఠశాల విద్య సర్వీసెస్ జేడీ మువ్వా రామలింగం సూచనలు కోరినట్లు వివరించారు. ఆపస్ సంఘం తరపున జేడీని కలిసి బదిలీ యాక్ట్‌కు సంబంధించిన సూచనలు ఇచ్చినట్లు చెప్పారు. ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్న బదిలీల యాక్ట్‌ను రూపొందించేందుకు రాష్ట్ర విద్యాశాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సిఫార్సు బదిలీలను అంగీకరించకూడదని, ప్రతి వేసవి సెలవుల్లో బదిలీల కసరత్తు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కనీసం రెండు సంవత్సరాలు, గరిష్ఠంగా ఆరేళ్ల పనిచేసిన వారికి అవకాశం కల్పించాలని కోరారు. పాఠశాల కేటగిరీల్లో మండల కేంద్రాలను ప్రత్యేక కేటగిరీలుగా గుర్తించాలని చెప్పారు. ప్రిఫరెన్షియల్ కేటగిరీలో 70 శాతం వైకల్యం ఉన్న వారికి మాత్రమే అనుమతించాలన్నారు. మిగిలిన వారికి స్పెషల్ కేటగిరీ పాయింట్లు కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ నేతలు సత్యనారాయణ, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠ రేపుతున్న కౌంటింగ్

- ఎక్కడ చూసినా ఎన్నికల ఫలితాలపైనే చర్చలు
- విజయంపై ధీమాలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు





స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచిన ఈవీఎంలు

చిత్తూరు కార్పొరేషన్: సార్వత్రిక ఓట్ల లెక్కింపు సమీపిస్తున్న కొద్దీ అందరిలో ఉత్కంఠ పెరుగుతోంది. ఎక్కడ చూసినా కౌంటింగ్ పైనే చర్చ. ఏ ఇద్దరు కలిసినా విజయం ఎవరిని వరిస్తుందనే అంశంపైనే విశ్లేషణలు జోరుగా కొనసాగుతున్నాయి. మరో పక్క జూన్ 4న చిత్తూరులోని ఎస్వీసెట్‌లో జరిగే కౌంటింగ్‌కు శరవేగంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలోని పార్లమెంట్, 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. 2019లో ఏప్రిల్ 11న ఎన్నికలు జరగ్గా ఫలితాల కోసం 41 రోజులు ఎదురుచూడాల్సి వచ్చింది. ఈ సారి 21 రోజులు వేచి ఉండాల్సిన పరిస్థితి.

ఐదు రోజులే గడువు

కౌంటింగ్‌కు నేటికి మరో 5 రోజులు మాత్రమే గడువుంది. వచ్చే మంగళవారం ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు మొదలవుతుంది. ఒక్కో రౌండ్ దాదాపు గంట సేపు లోపలే ముగించే అవకాశం ఉంది. ఈ లెక్కన చిత్తూరు నియోజకవర్గంలోని 226 పోలింగ్ బూత్‌ల పరంగా 14 టేబుళ్ల చొప్పున లెక్కిస్తే దాదాపు 17 రౌండ్ల లెక్కింపు జరపనున్నారు. తొలుత పోస్టల్ బ్యాలెట్స్ వచ్చేస్తుంది. పోలింగ్ సరళిని బట్టి ఇప్పటికీ పోటీలో నిలిచిన అధికార, విపక్ష పార్టీల అభ్యర్థులు, వారి అనుచరులు గ్రామాలు, వార్డుల వారీగా తమకు వచ్చే ఓట్లపై అంచనాల్లో ఉన్నప్పటికీ గడువు సమీపిస్తుండడంతో ఉత్కంఠ పెరిగిపోతోంది. కౌంటింగ్ రోజు కోసం ప్రజలు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మ రోపక్క గ్రామాలు, పట్టణాల్లో ఏ ఇద్దరు కలిసినా ఎన్నికల ఫలితాలపైనే చర్చించుకుంటున్నారు. జిల్లాలోని పార్లమెంట్, ఏడు అసెంబ్లీ స్థానాల్లో పోటీలోని అభ్యర్థుల విజయావకాశాలు, విజయం సాధిస్తారనుకునే వారి మెజారిటీ ఎంతవరకు రావచ్చు. రాష్ట్రంలోని ముఖ్యనేతల విజయావకాశాలు, ఏ పార్టీ అధికారంలోకి వస్తుంది. కేంద్రంలో ఏ పార్టీ సంపూర్ణ ఆధిక్యత సాధిస్తుంది? గత ఎన్నికల ఫలితాలను బేరీజు వేస్తూ పలు అంశాలపై ఎక్కడ చూసినా జోరుగా చర్చలు జరుపుతూ, రూ.లక్షల్లో బెట్టింగ్ చేస్తున్నారు.

సంక్షేమ పథకాలపైనే నమ్మకం

2019 ఎన్నికల్లో రాష్ట్రంలో 175 స్థానాలకు 151 స్థానాలతో వైఎస్సార్‌సీపీ చారిత్రాత్మక విజయం సాధించింది. జిల్లాలోని పార్లమెంట్ స్థానం, 7 అసెంబ్లీ స్థానాల్లో కుప్పం మినహాయించి ఆరు అసెంబ్లీ స్థానాల్లో విజయ కేతనం ఎగురవేసింది. ఈ ఐదేళ్లలో కనీవినీ ఎరుగని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాధించిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు, కూటమిలో అంతర్గత కుమ్ములాటలతో ఈ సారి క్లీన్ స్వీప్ ఖాయమన్న ధీమాలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఉన్నారు. పోలింగ్ శాతం పెరగడం, అర్ధరాత్రి వరకు వృద్ధులు, మహిళలు క్యూలో నిలబడి ఓట్లు వేయడం వంటి పాజిటివ్ ఓటుకు నిదర్శనమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

అట్టహాసంగా దుర్యోధన వధ



యుద్ధ సన్నివేశంలో తలపడుతున్న భీమ, దుర్యోధన పాత్రధారులు

ఐరాల: మండలంలోని నాంపల్లె రెవెన్యూ గ్రామంలో శ్రీ దౌపదీ సమేత ధర్మరాజులు ఆలయ మహాభారత ఉత్సవాల్లో భాగంగా బుధవారం దుర్యోధన వధ ఘట్టం అట్టహాసంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పురవీధుల్లో అమ్మవారి ఉత్సవ విగ్రహంతో పాటు శ్రీ కృష్ణ, భీమ, అర్జున, సకల, సహదేవ ఉత్సమూర్తులను ఊరేగించారు. మధ్యాహ్నం దుర్యోధన వధ ఘట్టాన్ని కళాకారులు రక్తికట్టించారు. ముందుగా గంగమడుగులో దాక్కొని ఉన్న దుర్యోధనుడిని భీమసేనుడు లాక్కొచ్చి చేసే యుద్ధ సన్నివేశం అలరించింది. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన దుర్యోధనుడి ప్రతిమ వద్ద సాగిన భీమ, దుర్యోధన వేషధారుల యుద్ధ సన్నివేశాలు కట్టిపడేశాయి. కళాకారులు ఆలపించిన పద్యాలకు జనం చప్పట్లతో హోరెత్తించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి విచ్చేసిన జనంతో ఆలయం వద్ద సందడి నెలకొంది. అనంతరం భీముడి వేషధారి దుర్యోధనుడిని వధించడం చూపరులను ఎంతో ఆకట్టుకుంది.

వజ్రాలపురం గంగమ్మ ఊరేగింపు



విశేషాలంకారంలో వజ్రాలపురం గంగమ్మ

బంగారుపాళెం: మండలంలోని వజ్రాలపురం బోయకొండ గంగమ్మ ఊరేగింపు బుధవారం రాత్రి ఘనంగా సాగింది. మూడు రోజుల పాటు అమ్మవారి జాతర కనులపండువలా నిర్వహించారు. జాతర కార్యక్రమంలో భాగంగా సోమ, మంగళవారాల్లో అమ్మ వారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. చివరి రోజున అమ్మవారికి ఉదయం అభిషేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని వివిధ రకాల పుష్పాలతో కనువిందుగా అలంకరించి వాహనంపై కొలువుదీర్చారు. అనంతరం అమ్మవారి సన్నిధి నుంచి బొమ్మాయిపల్లె, కురప్పల్లె, తిమ్మోజుపల్లె, కరిడివారిపల్లె, రామానాయుడుపాళెం మీదుగా మేళతాళాలతో ఘనంగా ఊరేగించారు. అమ్మవారికి అధిక సంఖ్యలో భక్తులు కొబ్బరికాయలు కొట్టి, కర్పూర నీరాజనాలు పలికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అమ్మవారి జలప్రవేశ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీసులు గట్టి బందోబస్తు చేపట్టారు. ఆలయ ధర్మకర్తలు రాధమ్మ, కృష్ణప్ప, కమిటీ సభ్యులు మాట్లాడుతూ అమ్మవారి జాతర మహోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన ఉభయదారులకు, పరిసర గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

గంగమ్మ నిమజ్జనం

మండల కేంద్రంలో బుధవారం రాత్రి గంగమ్మ నిమజ్జన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. జాతరలో భాగంగా మంగళవారం రాత్రి అమ్మవారి శిరసును విశేషంగా అలంకరించి సింహ వాహనంపై అధిష్టింపజేశారు. అనంతరం పురవీధుల్లో బాణాసంచా వేడుకల నడుమ ఘనంగా ఊరేగించారు. బుధవారం తెల్లవారు జామున గ్రామ నడివీధిలో ఏర్పాటు చేసిన మండపంలో గంగమ్మను కొలువుదీర్చారు. పెద్దసంఖ్యలో భక్తులు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి అమ్మవారిని జలప్రవేశానికి తరలించారు. ఈ కార్యక్రమంలో గంగమ్మ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



అమ్మవారి గ్రామోత్సవం



నిమజ్జనానికి తరలుతున్న గంగమ్మ

కోలాహలం.. నిమజ్జనోత్సవం



బీఎన్‌ఆర్‌పేటలో నిమజ్జనానికి బయలుదేరుతున్న అమ్మవారు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నియోజకవర్గ వ్యాప్తంగా బుధవారం గంగమ్మ నిమజ్జనాన్ని కోలహలంగా నిర్వహించారు. నగరంలోని మూడవగేటు, మురుగానంపల్లి, ఇరువారంలో ఈ వేడుకలు అత్యంత వైభవంగా చేపట్టారు. మండలంలోని పిళ్లారిమిట్ట, బీఎన్‌ఆర్ పేట, తెల్లగుండ్ల వలస గ్రామాల్లో నిమజ్జనాన్ని భక్తిశ్రద్ధలతో పూర్తి చేశారు. తొలుత అమ్మవారు విశేష పూజలు అందుకుని, స్థానిక వీధుల్లో అంగరంగ వైభవంగా ఊరేగారు. గ్రామస్తులు పసుపు పళ్లెంతో హారతి అందించి మొక్కులు చెల్లించుకున్నారు. మూడవ గేటు ప్రాంతంలో గంగమ్మ జాతర నిమజ్జనోత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన ఓం శక్తి విన్యాసాలు భక్తులకు కనువిందు చేశాయి.